సాక్షి
చిత్తూరు
శుక్రవారం ၊ 27 ၊ జనవరి ၊ 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,100

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	31	16
తిరుపతి	32	17
తిరుమల	27	13
గూడూరు	32	19
నగరి	32	17



వంద అడుగుల జెండా ఆవిష్కరణ

ఏర్పేడు: మేర్లపాక రెవెన్యూలో ఉన్న ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో డైరెక్టర్ కేఎన్. సత్యనారాయణ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. 100 అడుగుల జెండాను ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

లాభాల బాటలోకి తీసుకెళ్తాం

–స్టార్ లైనర్ బస్సుల ప్రారంభోత్సవంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: సంస్థను లాభాల బాటలోకి తీసుకెళ్లి నష్టాలను అధిగమించే దిశగా కార్మికులు, ఉద్యోగులు సమష్టి కృషి చేయాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో గురువారం స్టార్ లైనర్ నాన్ ఏసీ స్లీపర్ సర్వీసును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సర్వీసు రోజూ రాత్రి 9.30 గంటలకు ఆర్టీసీ బస్టాండు నుంచి హైదరాబాద్‌కు బయల్దేరుతుందని, అలాగే మరుసటి రోజు ఉదయం 7.15 గంటలకు హైదరాబాద్ నుంచి తిరుగు ప్రయాణమవుతుందని చెప్పారు. జిల్లా వాసులు ఈ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్మికులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తానని హామీ ఇచ్చారు. బస్టాండులోకి వచ్చే రోడ్డు మరమ్మతులకుగాను రూ.30 లక్షలతో త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు ఇబ్రహీం, అల్తాఫ్, జగదీష్, కార్మికులు పాల్గొన్నారు.

దళితులశ్మశాన వాటిక ఆక్రమణ



శ్మశానంలో నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

శ్రీరంగరాజపురం : తరతరాలుగా దళితులు వినియోగించుకుంటున్న శ్మశాన వాటికను దర్జాగా ఆక్రమించేశారు. వివరాలు..మండలంలో మెదవాడ పంచాయతీ మత్రిపల్లె దళితవాడ వాసులకు 80 సెంట్ల శ్మశానవాటిక ఉంది. తరతరాలుగా దీనిని వినియోగిస్తున్నారు. గురువారం ఒక గ్రామస్తుని కర్మక్రియలు నిర్వహించడానికిగాను శ్మశానవాటికి వద్దకు వెళితే అక్కడ ఎవరూ వెళ్లకుండా ముళ్లకంపలు అడ్డుగా వేసి ఉండడంతో విస్తుపోయారు. మత్రిపల్లెకు చెందిన సుధాకర్‌నాయుడు, బాలయ్య నాయుడు శ్మశాన స్థలంలో 70 సెంట్లను ఆక్రమించి ముళ్లకంపలు వేసినట్లు తెలుసుకుని నిరసన వ్యక్తం చేశారు. భూఆక్రమణదారుల నుంచి శ్మశాన స్థలానికి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యను డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. సర్వే చేసి, శ్మశాన వాటిక స్థలాన్ని దళితులకు అప్పగించాలని తహసీల్దార్‌ను, ఆక్రమణకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఫోన్‌లో ఆయన ఆదేశించారు.

చిత్రలేఖన పోటీలో యాదమరి విద్యార్థి ఫస్ట్



చిత్తూరులో బహుమతి అందుకుంటున్న యాదమరి విద్యార్థి చరణ్

యాదమరి: జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలలో యాదమరి విద్యార్థి విశేష ప్రతిభ కనబరచాడు. జాతీయ బాలికల దినోత్సవం(జనవరి 24న) సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఈ పోటీలు నిర్వహించింది. స్థానిక ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి చరణ్ పోటీలలో ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచాడు. గురువారం చిత్తూరులో నిర్వహించిన గణతంత్ర దిన వేడుకల్లో వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు చరణ్‌కు 10వేల రూపాయల నగదు బహుమతితోపాటు ప్రశంసా పత్రం అందజేశారు. అతడిని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిరాజ, డ్రాయింగ్ మాస్టర్ దాముఆచారి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

సదుం: మండలంలో శుక్రవారం కేంద్ర బృందం పర్యటించనున్నట్టు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. సదుం, తిమ్మానాయనపల్లె, జోగివారిపల్లె, ఎర్రాతివారిపల్లె పంచాయతీల పరిధిలో రెండ్రోజుల పాటు ఈ బృందం పర్యటిస్తుందని, కేంద్ర ప్రభుత్వ నిధులతో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను పరిశీలిస్తుందని తెలియజేశారు.



జాతీయ పతాకం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరి నారాయణన్



గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీస్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ బృందాలు

జయకేతనం

గణతంత్ర ఉత్సాహంతో నింగీ నేలా త్రివర్ణశోభితమైంది. మదిమదిలో దేశభక్తి ఉప్పొంగింది. జయకేతనమై సగర్వంగా ఎగిరింది. ఉల్లాస భరితమై ఆనందనర్తనం చేసింది. ఖ్యాతిని నలుదిశలా చాటింది. పథకాల ప్రగతి రథచక్రాలు కదం తొక్కాయి. జన సంక్షేమమే అజెండా అని చాటిచెప్పాయి.

- అభివృద్ధి పథంలో చిత్తూరు
- దేశం గర్వించే స్థాయికి యువత ఎదగాలి
- గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధన కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆ దిశగా జిల్లా అభివృద్ధి పథంలో పయనిస్తోందని చిత్తూరు కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. గురువారం 74వ గణతంత్ర దినోత్సవాన్ని స్థానిక పోలీస్ ట్రెనింగ్ సెంటర్ వద్ద పరేడ్ మైదానంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలు జిల్లాలో సమర్థవంతంగా పనిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను జిల్లాలో అందరి సహకారంతో పటిష్టంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 16 లక్షల నుంచి 18 లక్షల లీటర్ల పాల ఉత్పత్తిని రానున్న రెండేళ్లలో 20 లక్షల లీటర్లకు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. కుప్పం పర్యటనలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను శరవేగంగా చేయిస్తున్నామన్నారు. యువత దేశం గర్వించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ రంగాలు సాధించిన జిల్లా ప్రగతితో సహా ఆయా రంగాలకు ప్రభుత్వం ఇచ్చిన తోడ్పాటును సమగ్రంగా కలెక్టర్ వివరించారు.. కార్యక్రమంలో జిల్లా జడ్జి భీమారావు, న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్, 3వ అడిషనల్ జూనియర్ జడ్జి శ్రీనివాసరావ్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగర మేయర్ అముద, అడిషనల్ ఎస్పీ జగదీష్, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, ఆర్డీఓ రేణుక, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీఈఓ విజయేంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ తులసి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

పెరేడ్‌లో వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు ఆకట్టుకున్నాయి. పోలీస్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, దేవదాయ ధర్మాదాయ, పౌరసరఫరాల శాఖ, గ్రామీణ అభివృద్ధి సంస్థ, గృహ నిర్మాణ సంస్థ, ట్రాన్స్‌కో, పురపాలక, మహిళా– శిశు సంక్షేమం, సమగ్రశిక్ష శాఖ, వ్యవసాయ శాఖలు తమ శాఖల పరిధిలో అమలు చేస్తున్న పథకాలను తెలియజేస్తూ శకటాలను ప్రదర్శించాయి. ఇందులో మొదటి బహుమతి డీఆర్‌డీఏ సంస్థ ప్రదర్శించిన స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలతో అభివృద్ధి చెందుతున్న తీరును ప్రదర్శించారు. ద్వితీయ బహుమతి వ్యవసాయ శాఖకు దక్కింది. ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడంతో చిరుధాన్యాలు, వంటలు ప్రదర్శించారు. చిత్తూరు జిల్లాలో అధిక మొబైల్ నిఘా వ్యవస్థ కలిగిన వాహనాన్ని పోలీసు శాఖ ప్రదర్శించి 3వ బహుమతి పొందింది. గెలుపొందిన శకటాలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

రూ.1,163 కోట్ల ఆస్తుల పంపిణీ

వివిధ శాఖల ద్వారా రూ.1,163 కోట్లకు సంబంధించి ఆస్తులను కలెక్టర్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా డీఆర్‌డీఏ ద్వారా బ్యాంకు లింకేజీలో 16,749 ఎస్‌హెచ్‌జి గ్రూపులకు రూ.815.39 కోట్లు, స్త్రీ నిధి కింద 34,927 ఎస్‌హెచ్‌జి గ్రూపులకు రూ.142.19 కోట్లు, మెప్మాకు సంబంధించి బ్యాంకు లింకేజీ కింద 1,876 ఎస్‌హెచ్‌జి గ్రూపులకు రూ.202 కోట్లు, ఉద్యానశాఖ ద్వారా 260 మంది రైతులకు రూ.2.41 కోట్ల మెగా చెక్కులను పంపిణీ చేశారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా రూ.44 లక్షలతో 36 మందికి రెట్రో ఫిటడ్ మోటరైజ్డ్ స్కూటర్లు, ఇద్దరికి టచ్ ఫోన్లు, ఒక లాప్ టాప్‌ను అందజేశారు. వివిధ శాఖల స్టాళ్లను కలెక్టర్, అతిథులు ఆసక్తిగా తిలకించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్య ప్రదర్శన బహుమతులు అందుకున్న విద్యార్థినులతో కలెక్టర్, జేసీ తదితరులు

జిల్లా విద్యాశాఖ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి పూరిత ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఆర్‌కే మోడల్ స్కూల్, విజయం విద్యాసంస్థలు, పీఎన్‌సీ నగరపాలక ఉన్నత పాఠశాల, సంతపేట విద్యార్థులు, ఆర్‌కే విద్యాలయ ఇంగ్లిష్ మీడియం స్కూలు, శ్రీలక్ష్మి భరత నాట్యం ఇన్‌స్టిట్యూట్, లిటిల్ ఫ్లవర్ ఎయిడెడ్ పాఠశాల, న్యూయార్క్ పాఠశాల, మురుగానిపల్లె విద్యార్థులు తమ నృత్య ప్రదర్శనలతో ఉర్రూతలూగించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన పాఠశాలలకు బహుమతులు ఇవ్వడంతోపాటు విధి నిర్వహణలో ప్రతిభ చాటిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది..మొత్తం 266 మందికి ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందజేశారు.



ప్రథమ బహుమతి పొందిన డీఆర్‌డీఏ శకటం



ద్వితీయ బహుమతి..వ్యవసాయ శాఖ శకటం



తృతీయ బహుమతి..పోలీస్ శాఖ శకటం



చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్, జెడ్పీ చైర్మన్

సేవలకు ‘గణ’ సత్కారం



జగదీశ్ (ఏఎస్పీ), జె.తిప్పేస్వామి (ఏఎస్పీ), పి.ప్రభాకర్‌రెడ్డి, (సీఈఓ, జెడ్పీ), ఎస్.సుజన (ఆర్డీఓ, నగరి), సి.రేణుక, (ఆర్డీఓ, చిత్తూరు)



ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎన్.రాజశేఖర్ (డీఆర్ఓ)

చిత్తూరు కలెక్టరేట్ : విధి నిర్వహణ పరంగా జిల్లాకు చెందిన పలువురు అధికారులు, సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాలు వరించాయి. జిల్లాలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన 74వ గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ హరినారాయణన్ చేతుల మీదుగా ఉద్యోగులు పురస్కారాలు అందుకున్నారు.



ఎస్.నాగశైలజ (ఐసీడీఎస్, పీడీ), డి.మధుసూదనరెడ్డి (జిల్లా ఉద్యానవన అధికారి), జె.మురళీకృష్ణ (జిల్లా వ్యవసాయశాఖ అధికారి), కేవీ.నాగజ్యోతి (ఆర్‌డబ్ల్యుఎస్, ఎస్ఈ), ఎస్.ఉమాదేవి (జిల్లా అర్థ గణాంకాధికారి), ఎస్.శోభారాణి (జిల్లా పట్టు పరిశ్రమ సంచాలకులు), పి.వెంకటేశ్వరన్ (సూపరింటెండెంట్, కలెక్టరేట్), ఆర్.విజయశంకరరెడ్డి (జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి), రవిరాజు (డీఐఓ), శ్రీనివాసులు (డీఎంఓ)

రిపబ్లిక్ డే హైటీ



హైటీ కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక పోలీస్ ట్రెనింగ్ సెంటర్‌లో గురువారం రిపబ్లిక్ డే హైటీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ యం. హరినారాయణన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, ఎంఎల్‌సీ భరత్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, ఏఎస్పీ జగదీష్, ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తులసి, ఆర్డీఓ రేణుక, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్లకు ఘన నివాళి



అంజలి ఘటిస్తున్న చెవిరెడ్డి

తిరుపతి అలిపిరి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గురువారం జాతీయ జెండా ఆవిష్కరించారు. గౌరవ వందనం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ వందన సమర్పణ చేశారు. అంతకుముందు తిరుపతి కపిలతీర్థం సమీపంలోని వీర జవానుల స్థూపానికి మాజీ సైనికులతో కలసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ సెల్వం, ఏసీఎఫ్ నాగభూషణం, మాజీ సైనికులు, జూ పార్క్ సిబ్బంది పాల్గొన్నారు.

అండగా ఉంటా..అభివృద్ధి చేస్తా

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పార్టీలో చేరిన యల్లంపల్లె టీడీపీ నాయకులు



జాతీయ పతాకం ఎగురవేసి గౌరవ వందనం సమర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు): అందరికీ అందుబాటులో ఉంటూ మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానని రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, భూగర్భ గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలో ఆయన తొమ్మిది పంచాయతీల్లోని 52 గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని, తనను ఎప్పుడైనా ప్రజలు నిరభ్యంతరంగా కలవచ్చన్నారు.ఎర్రపాపిరెడ్డిగారిపల్లెలో మంత్రి పర్యటన సందర్భంగా ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాలతో భారీ బైక్ ర్యాలీ అట్టహాసంగా నిర్వహించారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

మండలంలోని ఎర్రపాపిరెడ్డిగారిపల్లె, కమ్మపల్లె, దేవళంపేటలో గ్రామ సచివాలయాలు, పాళెం, ఎర్రపాపిరెడ్డిగారిపల్లె, మిట్టమీదరాచపల్లె, దేశిరెడ్డిగారిపల్లెలో ఆర్వో ప్లాంట్లు, మరో రెండు గ్రామాల్లో ఆర్బీకే సెంటర్లు, యల్లంపల్లెలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను మంత్రి ప్రారంభించారు.

జాతీయ పతాకం ఆవిష్కరణ

రిపబ్లిక్ డే సందర్భంగా మండలంలోని ఎర్రపాపిరెడ్డిగారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో మంత్రి జాతీయ జెండా ఎగురవేసి గౌరవవందనం సమర్పించారు. చిన్నారులతో ముచ్చటించారు. స్కూలు ఆవరణలో మొక్కలు నాటారు.

మంత్రి సమక్షంలో పార్టీలో చేరిక

దిగువ పోకలవారిపల్లె పంచాయతీ యల్లంపల్లెకు చెందిన దాదాపు 20 మంది టీడీపీ నాయకులు మంత్రి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మదన్‌మోహన్ గౌడ్, బాలు, లోకేష్, దినేష్, కరుణాకర్ మరి కొందరు ఉన్నారు. వారికి పార్టీ కండువాలు కప్పి మంత్రి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, నాయకులు రెడ్డీశ్వరరెడ్డి, వల్లివేడు రాజారెడ్డి, సర్పంచులు స్వాతిబాల, రాణెమ్మ, సులోచన, నాగరత్న, ఉష, పోకల ఉమాదేవి, సరస్వతి, మంజుల, ఈశ్వరి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దేశంలో మోదీ, అమిత్‌షా రాజ్యాంగం

నగరి : దేశంలో మోదీ, అమిత్‌షా రాజ్యాంగం నడుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు విమర్శించారు. గురువారం సీపీఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ×భారతదేశ రాజ్యాంగాన్ని రక్షించుకుందాం–లౌకిక వాదాన్ని కాపాడుకుందాం× నినాదంతో నగరిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మోదీ, అమిత్‌షా నాయకత్వంలో భారతదేశంలో రాజ్యాంగ వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేస్తోందని, దేశ ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలుగా ఉన్న ప్రభుత్వ సంస్థలు, బ్యాంకింగ్, ఎల్‌ఐసీ..ఇలా అన్నింటినీ అదాని, అంబానీలకు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. సీబీఐ, సీఐడీ, రిజర్వ్ బ్యాంకు, ఈడీలను ప్రభావితం చేసే స్థాయిలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోదండయ్య, పట్టణ కార్యదర్శి వేలన్, అంబేడ్కర్ సంఘం జాతీయ కార్యదర్శి గోవింద్ స్వామి, ఏఐటీయూసీ నాయకులు సుబ్రహ్మణ్యం, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



కాణిపాకం(యాదమరి):కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రదీప్ చక్రవర్తి రూ.లక్ష విరాళాన్ని ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌కు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు స్వామి వారి ప్రత్యేక దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పన్ను వసూళ్ల లక్ష్యం అధిగమిస్తారా?

- రెండు నెలల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- టార్గెట్ రూ.22.71 కోట్లు
- వసూలు రూ.10.25 కోట్లు
- 191 కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు



చింతలగుంట పంచాయతీ పన్ను వివరాలు చెబుతున్న కార్యదర్శి

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరు పన్నులే. ఇవి సక్రమంగా వసూలైతే ఆయా పంచాయతీల పరిధిలో అభివృద్ధి పనులకు వెచ్చించడానికి అవకాశం ఉంటుంది. గ్రామాల్లో ఎక్కువగా కేంద్ర గ్రాంట్లు, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పనులు చేస్తున్నారు. అయితే పన్నులు ఆశించిన స్థాయిలో వసూలు కాకపోతే అభివృద్ధి పనులపై ఇది ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి రెండు నెలలు మాత్రమే ఉంది. జిల్లాలో పంచాయతీల పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.22.71 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.10.25 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇంకనూ రూ.12.46 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. వీటి వసూళ్ల విషయంలో ఉదాశీనంగా వ్యవహరిస్తున్న 191 కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే పంచాయతీరాజ్ కమిషనర్ పన్నుల వసూలుపై ప్రతి వారం సమీక్షిస్తుండడంతో జిల్లా పంచాయతీ యంత్రాంగం దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది.

సర్పంచుల పాత్ర కీలకం

గ్రామ పంచాయతీల్లో పన్నులు (ఇంటి పన్ను, లైబ్రరీ సెస్సు, కుళాయి పన్ను),పన్నేతరములు (మార్కెట్ వేలాలు, షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలు, లైసెన్స్ ఫీజులు, కుళాయి ఫీజు, భవన నిర్మాణ ఫీజులు), రూపంలో సొంత వనరులను సమీకరించుకోవడంలో సర్పంచులు తమ పాత్రను పోషించాల్సిన అవసరం ఉంటోంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం, ఇతర గ్రాంట్ల పైనే గ్రామ పంచాయతీ పాలకవర్గాలు దృష్టి కేంద్రీకరించడం మినహా పంచాయతీల పరిధిలో స్థానిక వనరులు, ఇతరత్రా వాటి నుంచి ఆదాయం పెంపొందించుకునే మార్గాలను అన్వేషించడం లేదు.

సమష్టి కృషి అవసరం

ఆదాయాన్ని పెంచుకునే విషయంలో క్షేత్రస్థాయి అధికారులు సమష్టి కృషి చేయాల్సిన అవసరం ఉంది. పలు గ్రామ పంచాయతీల్లో దశాబ్దం క్రితం ఉన్న ఇళ్ల సంఖ్యనే ఇప్పటికీ లెక్కల్లో చూపుతున్నారు. జిల్లాలోని 697 గ్రామ పంచాయతీల్లో దాదాపు 50 శాతం ఇళ్ల సంఖ్య పెరిగింది. ఆయా గ్రామ పంచాయతీల్లో కొత్త కాలనీలు ఏర్పాటయ్యాయి. అయితే కొత్తగా గ్రామ శివారుల్లో ఏర్పాటవుతున్న కాలనీలు, కొత్త ఇళ్లపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడం వల్ల ఆయా గ్రామ పంచాయతీలు ప్రత్యక్షంగా పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని కోల్పోతున్నాయి.

పన్నుతో... పనులు

సాధారణంగా పంచాయతీలకు వచ్చే పన్నుల మొత్తంలో 8 శాతం లైబ్రరీ సెస్, 30–40 శాతం విద్యుతు చార్జీలకు కడతారు. మిగిలిన మొత్తాన్ని శానిటేషన్, గ్రీన్ అంబాసిడర్లు, పంప్ ఆపరేటర్లు, స్వీపర్ల వేతనాలు, నీటి వసతి, చిన్న చిన్న మరమ్మతులు, బోర్ల మరమ్మతు, వీధి దీపాల, కొళాయిల కొనుగోలు, ఇతర మరమ్మతులకు వినియోగిస్తారు.

జిల్లా పంచాయతీల సమాచారం

జిల్లాలోని మొత్తం పంచాయతీలు	:	697
మేజర్ పంచాయతీలు	:	11
మైనర్ పంచాయతీలు	:	686
పంచాయతీ కార్యదర్శుల సంఖ్య	:	665
వసూలు చేయాల్సిన పన్నుల మొత్తం	:	రూ.22.71 కోట్లు
వసూలు చేసింది జనవరి వరకు	:	రూ.10.25 కోట్లు
ఇంకా వసూలు చేయాల్సింది	:	రూ.12.46 కోట్లు
2021–22 టార్గెట్	:	రూ.22.53 కోట్లు
2021–22 వసూలు	:	రూ.19.33 కోట్లు
పన్నుల కింద వచ్చేవి	:	ఇంటి పన్ను, లైబ్రరీ సెస్సు, కుళాయి పన్ను, మార్కెట్ వేలాలు, షాపింగ్ అద్దెలు, లైసెన్స్‌ఫీజులు, కుళాయి ఫీజు, భవన నిర్మాణ ఫీజులు
వసూల చేసిన పన్నుల వినియోగం	:	సీసీ రోడ్డు, పారిశుద్ధ్యం, వసతులు, అభివృద్ధి పనులు
15వ ఆర్థిక సంఘం నిధులు	:	రూ.27.65 కోట్లు

తీరు మార్చుకోవాలి



పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూళ్లపై తీరు మార్చుకోవాలి. ఇది వరకే విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న కార్యదర్శులు 191 మంది షోకాజ్ నోటీసులు ఇచ్చాం. అయిన పద్ధతి మార్చుకోకపతే చర్యలు తప్పవు. డివిజన్ల వారీగా ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలి. దీనిపై కలెక్టర్, జెడ్పీ ఛైర్మన్, సీఈఓ సీరియస్‌గా ఉన్నారు. నిత్యం పలు అంశాలపై వీసీ, టీసీ ద్వారా సమీక్షిస్తున్నాం. గ్రామ పంచాయతీల ఆదాయం పెంచుకునే దిశగా ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలి.

– లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి

రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి

– ముగ్గురికి గాయాలు



మృతి చెందిన కారు డ్రైవర్ మన్నన్

బంగారుపాళెం: మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి కేజీ సత్రం వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి చెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. ఏఎస్‌ఐ మల్లప్ప కథనం.. కేజీ సత్రం రహదారిలో చిత్తూరు నుంచి బెంగళూరు వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని నియంత్రణ కోల్పోయి ఎదురుగా బెంగళూరు నుంచి పుత్తూరుకు వెళ్తున్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో పుత్తూరుకు చెందిన కారు డ్రైవర్ మన్నన్(50) అక్కడికక్కడే మరణించాడు. కారులో ప్రయాణిస్తున్న రాజాపతి(65) అతని భార్య ప్రేమ(60), మరో కారులో వెళ్తున్న తమిళనాడులోని పాలకుర్చికి చెందిన గోకుల్ (32) తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేపాల్ మహిళ ఆత్మహత్య



మృతి చెందిన పశుపతి కార్కి

నారాయణవనం: నేపాల్ దేశానికి చెందిన మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన కైలాసనాధకోనలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ పరమేష్ నాయక్ కథనం..కైలాసకోన సమీపంలోని ఎస్వీఎస్ గెస్ట్ హౌస్ కరియు రిసార్ట్‌లో నేపాల్‌కు చెందిన రంజిత్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. తన ఇద్దరు పిల్లలు, భార్య పశుపతి కార్కి(26)తో కలిసి గెస్ట్ హౌస్ వద్దనే కాపురం ఉంటున్నాడు. గురువారం ఉదయం పశుపతి కార్కి తమ ఇంటి బాత్ రూంలో చున్నీతో ఉరివేసుకుని బలవన్మరణం చెందింది. పశుపతి కార్కి చెల్లెలి భర్త ఇచ్చిన ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాల కారణంగా కార్కి ఆత్మహత్య చేసుకుందా? మరే ఇతర కారణాలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

సరస్వతీ నమస్తుభ్యం



అక్షరాభ్యాసంలో చంటి పిల్లలు, వారి తల్లిదండ్రులు

- శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం

కాణిపాకం (యాదమరి): వసంత పంచమి సందర్భంగా కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆస్థాన మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి అర్చక వేదపండితులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అలంకరణలు చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు అక్షరాభ్యాస కార్యక్రమం ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు.

భక్తులతో కిటకిట

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి స్వామివారి దర్శనార్థం తరలి రావడంతో కంపార్ట్‌మెంట్లు, క్యూలైన్లు నిండిపోయి ఆలయం వెలుపల వరకు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు.

దూరమైన అయినవాళ్లు.. ఆగని కన్నీళ్లు

'చేతికొచ్చిన బిడ్డలు జీవిత చరమాంకంలో అండగా ఉంటారనుకున్నాం. కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తారని ఆశలు పెట్టుకున్నాం. తోడబుట్టిన వాళ్లకు చేదోడువాదోడుగా నిలుస్తారని భావించాం. మమ్మలందర్నీ వదిలి అప్పుడే వెళ్లిపోయారా.. నాయనా..!' అంటూ రోడ్డు ప్రమాద బాధితుల బంధువులు బోరున విలపించారు. రుయా మార్చురీ వద్ద విగత జీవులుగా పడి ఉన్న బిడ్డల మృతదేహాలు చూసి తల్లడిల్లిపోయారు. మృతదేహాలపై పడి గుండెలు బాదుకుంటూ విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

- రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఐదు మృతదేహాలు మహారాష్ట్రకు తరలింపు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం స్విమ్స్‌కు రెఫర్
- మిన్నంటిన బంధువుల రోదనలు



మృతదేహం వద్ద బంధువులు, పోలీసులు

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక యాత్ర ఆ కుటుంబాల్లో తీవ్ర శోకాన్ని మిగిల్చింది. వారిపైనే ఆశలు పెట్టుకుని జీవిస్తున్న తల్లిదండ్రులను పుట్టెడు దుఃఖంలోకి నెట్టింది. యాత్రలో భాగంగా మహారాష్ట్రకు చెందిన 9 మంది యువకులు తిరుపతి నుంచి కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దర్శనానికి వెళుతూ బుధవారం ప్రమాదానికి గురైన విషయం తెల్సిందే. చంద్రగిరి మండలంలోని జాతీయ రహదారి కల్‌రోడ్డుపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయాలపాలయ్యారు. మృతుల కుటుంబ సభ్యులు గురువారం తిరుపతికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

మిన్నంటిన రోదనలు

రుయా మార్చురీ వద్ద మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాలను చూసి బోరున విలపించారు. దేవుడి దర్శనానికి వచ్చి దూరమయ్యావా బిడ్డా అంటూ అజయ్‌నంగ్‌నాథ్, రుషికేశ్ జంగంతండ్రులు గుండెలు బాదుకుంటూ విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. నీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నా.. ఇంతలో దూరమయ్యావా నాయనా.. అంటూ అంబదాస్ కుమార్ తండ్రి కన్నీళ్లు పెట్టుకున్నారు.

తల్లడిల్లుతున్న క్షతగాత్రులు

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన క్షతగాత్రుల రోదన వర్ణనాతీతం. తీవ్ర గాయాలు కావడంతో భరించలేని స్థితిలో వారు తల్లడిల్లుతున్నారు. బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం క్షతగాత్రుల్లో ఒకరికి న్యూరో సర్జరీ అవసరమని, మిగిలిన వారికి తీవ్ర గాయాలు కావడంతో వైద్యాన్ని అందిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

మృతదేహాల తరలింపు

మృతదేహాలను అంబులెన్స్‌ల ద్వారా మహారాష్ట్ర షోలాపూర్‌కు తరలించారు. బంధువులు రావడంతో పోలీసుల సమక్షంలో వైద్యులు పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. చంద్రగిరి సీఐ ఓబులేశు చొరవ తీసుకుని ప్రైవేట్ అంబులెన్స్‌ను మాట్లాడి మహారాష్ట్రకు మృతదేహాలను తరలించేందుకు చర్యలు చేపట్టారు. ఆయన చొరవతోనే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం ఉన్నతాధికారులతో మాట్లాడి స్విమ్స్‌కు తరలించారు.

బాధితులకు భరోసా

- రూ.10.50 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు రూ.10.50 లక్షల చెక్కులను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. తిరుపతి రజకుల కాలనీకి చెందిన శేఖర్‌బాబుకు రూ.50 వేలు, విప్పమానుపట్టెడకు చెందిన తండ్లం బాలిరెడ్డికి రూ.10 లక్షల చెక్కులు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరయ్యాయి. ఆ చెక్కులను ఎమ్మెల్యే చెవిరెడ్డి చేతులు మీదుగా బాధితులకు అందించారు. అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో బాధపడే తమకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు రావడం ఆనందంగా ఉందని బాధిత కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు.

బ్యాంకుకు వినియోగదారుల కమిషన్ వడ్డన

తిరుపతి లీగల్ : సేవా లోపానికి పాల్పడినందుకు ప్రస్తుతం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇదివరలో ఆంధ్రా బ్యాంక్ ఫిర్యాదుదారులకు పరిహారం చెల్లించాలని తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు చెప్పింది. వివరాల్లోకి వెళితే.. తిరుపతి రూరల్ వేమూరుకు చెందిన గెరటప్ప నాయుడు తన పేరున ఉన్న వ్యవసాయ భూమికి సంబంధించిన విక్రయపత్రాన్ని బ్యాంకులో ఉంచి రెండు వేర్వేరుగా ఇంటి రుణాలను 2004లో తీసుకున్నారు. 2010లో ఆ వ్యవసాయ భూమిని తన కుమారులకు భాగపరిష్కారం చేసి భాగ పరిష్కార పత్రాన్ని రాసి ఇచ్చాడు. గెరటప్పనాయుడు 2018 ఫిబ్రవరి 23న మరణించాడు. ఆయన కుమారులు ఎస్.గోపాల్‌నాయుడు, తిరుపతి నిమ్మకాయల వీధికి చెందిన న్యాయవాది ఎస్.భూపాల్‌నాయుడు తన తండ్రి తీసుకున్న రుణాన్ని బ్యాంకుకు చెల్లించి తన తండ్రి ఇదివరలో ఉంచిన విక్రయపత్రాన్ని తిరిగి ఇవ్వాలని బ్యాంకు అధికారులను కోరారు. దీనిపై బ్యాంకు అధికారులు స్పందించలేదు. దీంతో ఇద్దరు కలసి తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్‌లో తిరుపతి బేరివీధి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్, ఎస్వీయూ క్యాంపస్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్లను ప్రతివాదులుగా పేర్కొంటూ ఫిర్యాదు దాఖలుచేశారు. ఇరువైపుల వాదనలు పరిశీలించిన తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు ఎ.పార్థసారథి, సభ్యులు ఎస్.శశిధర్‌రెడ్డి, టి.స్నేహత ఫిర్యాదుదారుల తండ్రి ఇదివరలో బ్యాంకులో ఇచ్చిన విక్రయపత్రాన్ని 45 రోజుల్లో ఫిర్యాదుదారులకు తిరిగి ఇవ్వాలని బ్యాంకు సిబ్బందిని ఆదేశిస్తూ తీర్పు చెప్పారు. అలాగే నష్టపరిహారం, సేవా లోపం కింద రూ.1.5 లక్షలను, ఫిర్యాదు ఖర్చులు కింద రూ.5వేలను ఫిర్యాదుదారులకు చెల్లించాలని తీర్పు చెప్పారు. అలా చెల్లించని ఎడల నష్ట పరిహారం సొమ్ముకు 9 శాతం వడ్డీ లెక్కన బ్యాంకు అధికారులు చెల్లించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. అలాగే వారి తండ్రి పాస్ బుక్‌ను బ్యాంకులో ఇచ్చివుంటే ఫిర్యాదుదారుల తల్లి, ఇతర సోదరుల వద్ద బాండు తీసుకుని తిరిగి ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు.